గురువు స్థానం మహోన్నతం

ప్రతీ వ్యక్తి జీవితంలో గురువు స్థానం మహోన్నతమైందని వక్తలు పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్యను అందించి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి దేశానికి ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ స్ఫూర్తి ప్రదాత అన్నారు. సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని కళాశాలల్లో, పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు.

- 'సర్వేపల్లి' స్ఫూర్తితో ముందుకు..
- ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు


అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో హెచ్‌ఎం కాంతంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


అగనంపూడి హైస్కూల్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కమిటీ, విద్యార్థులు


గురు పూజోత్సవం సందర్భంగా విద్యార్థినుల ప్రదర్శన

అగనంపూడి: గురువులకు సమాజంలో గుర్తింపు సర్వేపల్లి రాధాకృష్ణ వల్ల దక్కిందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ హెచ్‌ఎం బొండా అప్పారావు మాస్టారు అన్నారు. 85వ వార్డు పిన మడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన్ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, రైల్వే కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలి పాక అప్పారావు, హెచ్‌ఎం భీమశంకరరావు, ప్రజా సంఘాల నాయకులు కిడిమి హనుమంతరావు, సాలాపు అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

- 79వ వార్డు లంకెలపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్వేపల్లి చిత్రపటానికి హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు పూలమాల వేశారు. తరువాత ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలో పలు కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. ఉపాధ్యాయులు కె.రమణ, లక్ష్మీ రాణి, పండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- 86వ వార్డు అగనంపూడి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వి.ప్రసాద్ కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ నివాళులర్పించారు. అధ్యాపకులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, డీన్లు బి.ప్రసాద్, బి.సతీష్, నాగజ్యోతి పాల్గొన్నారు. గొన్నా విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్ నాయుడు సత్కరించారు.

గాజువాక: గాజువాక ప్రాంతంలో గురుపూజోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్లో ఉపాధ్యాయులను, టీఎ స్పార్, టీబీకే డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం పూర్వ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అహ్మద్ చేతులమీదుగా సత్కరించారు. విద్యా సంస్థల చైర్మన్ టి.బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఏయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెలగపూడి ఉమా మహేశ్వరరావు పాల్గొని, అధ్యాపకులను సత్కరించారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య బాల మోహన్‌దాస్, ఏయూ యోగా విలేజ్ డైరెక్టర్ ప్రొఫెసర్ భానుకుమార్, కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు పాల్గొన్నారు.
- స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, భాస్కర్ విద్యానికేతన్‌లలో గురుపూజోత్సవం నిర్వహించారు.

గాజువాక హైస్కూల్లో..

గాజువాక: గురుపూజోత్సవాన్ని గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న పాఠశాల ఉపాధ్యాయుడు దివాకర్‌ను, పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయ ప్రశాంతిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు ప్రణామం

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతంను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి విద్యార్థులు వివరించారు. విద్యార్థినులు ఉపాధ్యాయినులుగా చీరల్లో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మార్గదర్శకులు.. ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదగంట్యాడ ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను సత్కరించి, పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యు.ఎస్.ఎన్.జోగారావు, గొందేశి పెదరెడ్డి, ప్రసాద్, గొందేశి వెంకటరమణారెడ్డి, కె.అప్పారావు పాల్గొన్నారు.


కణితి హైస్కూల్ ఉపాధ్యాయిని అరుణను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

- పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి.వెంకటరమణ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని పాఠకులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.సురేష్, నరేష్, వేణు, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.
- 75వ వార్డులో బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగరపు శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మార్టుపూడి పరదేశి, ములకలపల్లి వెంకటేష్, పిట్టా రెడ్డి, నక్క రమణ, గొందేశి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయులను కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మురళీధర్‌రెడ్డి, సుబ్బరాజు, ప్రసాద్, శంకర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


యాపిల్ ఐ స్కూల్‌లో ఉపాధ్యాయినికి అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


గాజువాక హైస్కూల్‌లో అవార్డు గ్రహీత దివాకర్‌ను సత్కరిస్తున్న సహ ఉపాధ్యాయులు


లంకెలపాలెం హైస్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దేవన్‌రెడ్డి

- దువ్వాడ రామచంద్ర ఫంక్షన్ హాల్‌లో శ్రీ సాయి శారద సంగీత కళాశాల విశాఖ మరియు తుని విద్యార్థుల బృందం సింగర్ పి.సత్యవేణి ఆధ్వర్యంలో సంస్థ అధినేత షేక్ అమీనా సాహెబ్‌ను సత్కరించారు. అనంతరం విద్యార్థి బృందం అన్నమయ్య, భక్తరామదాసు, పురందర దాసుల సంగీత సంకలన కచేరీ నిర్వహించారు.
- కూర్మన్నపాలెం రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, పాఠశాలల జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డబుల్ ఎంట్రీ, వలస ఓటర్లకు నోటీసులు


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో ఓటు నమోదై ఉండి వలస వెళ్లిన ఓటర్లకు, డబుల్ ఎంట్రీలు కలిగిన ఓటర్లకు నోటీసులను జారీ చేశామని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలపై నిర్వహించిన సర్వే నూరుశాతం పూర్తయిందన్నారు. ఈ సర్వేలో గుర్తించిన చేర్పులు, మార్పులు, తొలగింపుల డేటా నమోదును ప్రారంభించామని తెలిపారు. సున్నా డోర్‌నంబర్ కలిగిన 54 ఓటర్ల చిరునామాలను మార్పు చేశామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ కెనరాబ్యాంక్ వెనుక చట్టివానిపాలెంలోని ఓ ఇంటి వరండాలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చట్టివానిపాలెంలో చెల్లిబోయిన అప్పలనర్సమ్మ ఇంట్లో చంటి అనే క్రేన్ ఆపరేటర్ రెండు నెలలుగా అద్దెకు ఉంటున్నాడు. అతని భార్య చిన్నమ్మలు వారం రోజులుగా ఊళ్లో లేదు. రెండు రోజులుగా అతడు వరండాలో పడుకుని లేవకపోవడం, దుర్గంధం రావడంతో మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు సోమవారం రాత్రి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సతీష్ వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

మూడేళ్ల బాలుడిపై కుక్కల దాడి


బాలుడి ఒంటిపై గాట్లు

కూర్మన్నపాలెం: మూడేళ్ల బాలుడిని వీధి కుక్కలు గాయపరిచిన ఘటన ఉడా ఫేజ్–1లో జరిగింది. వివరాలివి.. భవన నిర్మాణ కార్మికుడు రెడ్డి సంతోష్ కుటుంబంతో ఉడా ఫేజ్–1లో నివాసముంటున్నారు. మంగళవారం అతని కుమారుడు రెడ్డి కౌశిక్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధి కుక్కలు అమాంతం మీద పడి దాడి చేశాయి. దీంతో బాలుడు బిగ్గరగా అరిచేసరికి చుట్టుపక్కల వారు పరుగున రావడంతో కుక్కలు పారిపోయాయి. గాయపడిన కౌశిక్‌ను కుటుంబసభ్యులు అగనంపూడి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా


సచివాలయ కన్వీనర్ల నుంచి డేటా సేకరిస్తున్న శ్రీను, మంగరాజు

పెదగంట్యాడ: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా చేయించనున్నామని జేసీఎస్ మండల క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను తెలిపారు. 64వ వార్డు వెంకన్నపాలెంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పని చేస్తున్న వారికి పార్టీ బీమా సౌకర్యం కల్పిస్తోందన్నారు. ప్రతీ కన్వీనర్, గృహ సారథి తమ వివరాలను అందజేయాలని కోరారు. సమావేశంలో ధర్మాల పైడిరెడ్డి, ధర్మాల హరీష్, లత, ఎరుపల్లి రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో చోరీ


బీరువాలో సామగ్రి చిందర వందరగా పడేసిన దృశ్యం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి, నాలుగున్నర తులాల బంగారం, అరకేజీ వెండి అపహరించారు. దువ్వాడ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వడ్లపూడి తెలుకల వీధిలో ఫార్మా ఉద్యోగి రొంగలి మోహనరావు కుటుంబంతో నివాసముంటున్నారు. అగనంపూడిలో కొత్త ఫ్లాట్ కొనుగోలు చేసిన వారు గృహప్రవేశం చేసేందుకు ఈ నెల 1న అక్కడికి వెళ్లారు. మూడు రాత్రులు నిద్ర చేయాలన్న ఆచారం ప్రకారం అక్కడే ఉండి, 4వ తేదీ రాత్రి వడ్లపూడి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువా తెరిచి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన మోహనరావు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ కాళిదాసు సిబ్బందితో కలిసి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బీరువాలోని నాలుగున్నర తులాలు బంగారు ఆభరణాలు, అర కేజీ వెండి అపహరించినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యపోరాటాలతోనే ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ

- ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ కో–కన్వీనర్ ఝూన్సీ
- ఉక్కు పరిరక్షణ దీక్షలకు సంఘీభావం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఝూన్సీ

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలన్న బీజేపీ ప్రభుత్వ ధోరణిని ఐక్యంగా ఎదుర్కోవాలని ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ కో–కన్వీనర్ ఎస్.ఝూన్సీ అన్నారు. సంస్థలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 936వ రోజు మంగళవారం ఆమె పాల్గొని, దీక్షలకు సంఘీభావం తెలిపారు. కార్మికులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఐక్య పోరాటాలతోనే ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. మోదీ పాలనలో ప్రభుత్వరంగం మరింత బలహీనపడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే భారీ మూల్యం చెల్లించకోక తప్పదన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలన్నారు.

12, 13 తేదీల్లో సదస్సు

అటవీ సంరక్షణ చట్ట సవరణను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 12, 13 తేదీల్లో నగరంలోని రైల్వే న్యూకాలనీలో అఖిల భారత ఆదివాసీ సదస్సును నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. కార్మికులు పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య, డి.శ్రీనివాస్, రమణ, రాజు, గోపీ, ప్రసాద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జీవన్‌రాణి

పెదగంట్యాడ: గర్భిణుల ఆరోగ్యంపై ఆశ కార్యకర్తలు శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి అన్నారు. దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీ పరిధిలోని ఆశ కార్యకర్తలతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. హై రిస్క్ గర్భిణులు, సివియర్ ఎనిమిక్ గర్భవతులను తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో హయ్యర్ సెంటర్‌కు రిఫర్ చేయాలని సూచించారు. ఆశ యాప్‌లో విటమిన్ ఏ, అనీమియా మానిటరింగ్, హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ సందర్శనల గురించి వివరించారు. గర్భిణులకు ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.రవీంద్ర, డాక్టర్ పి.ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త సీజీఎంకు అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.వి.స్వామిని స్టీల్ ఓబీసీ సంక్షేమ సంఘం నాయకులు అభినందించారు. కొత్త సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు మంగళవారం ఆయనను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్.వి.నారాయణ, కోయిలాడ శ్రీనివాసరావు, జి.అప్పలరాజు, సన్నిబాబు, కన్నబాబు, దుర్గాప్రవీణ, ఉదయ కుమారి తదితరులు పాల్గొన్నారు.


సీజీఎం స్వామిని సత్కరిస్తున్న ఓబీసీ సంఘం నాయకులు

విశాఖకు విశ్వ ఖ్యాతి సీఎం జగన్ లక్ష్యం

- పాలనా రాజధానిగా ప్రపంచస్థాయిలో అభివృద్ధికి చర్యలు
- మేయర్ హరి వెంకట కుమారి
- రూ.2.79 కోట్ల పనులకు శంకుస్థాపన


70వ వార్డులో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: విశాఖకు విశ్వవ్యాప్తంగా పేరు తీసుకువచ్చేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. పరిపాలనా రాజధానిగా ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. జీవీఎంసీ 69వ వార్డులో రూ. 2 కోట్ల 79 లక్షల 11 వేలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాజువాకను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని, ఎన్నో ఏళ్లుగా తీరని సమస్యలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి ద్వారా తీర్చామని అన్నారు. ఈ సందర్భంగా నాతయ్యపాలెం బంగారుమాంబ అమ్మవారి ఆలయం వద్ద రూ.20 లక్షలతో డ్రైనేజీల అవుట్‌లెట్ నిర్మాణాలు, రూ.40 లక్షలతో షీలానగర్ రోడ్డు నంబర్ 3, 4లలో సీసీ డ్రైనేజీలు, బీటీ రోడ్ల నిర్మాణం, రూ.19.93 లక్షలతో బంగారమ్మ ఆలయం నుంచి కిమ్స్ ఐకాన్ రోడ్డు మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణం, రూ.1 కోటి 99 లక్షలు 18 వేలతో తుంగ్లాంలోని శ్మశానవాటికకు కాంపౌండ్ వాల్, వెయిటింగ్ రూంలు, ఎస్ డబ్ల్యూ డ్రైనేజీ, తుంగ్లాం, కాపుతుంగ్లాంలకు సీసీ అప్రోచ్ రోడ్డు, శ్మశానవాటిక అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాలను వారు ఆవిష్కరించారు.

అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పిస్తూ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తుంటే చంద్రబాబు ప్రజాధనాన్ని లూటీ చేస్తూ అడ్డంగా దొరికి పోయారన్నారు. ఐటీ శాఖ ఇచ్చిన రూ.118 కోట్ల నోటీసుల వ్యవహారంపై చంద్రబాబు నోరు విప్పకపోవడంతో చంద్రబాబు దొంగ అని తేలిందన్నారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానన్న పవన్ కల్యాణ్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న జగనన్న వైపే ప్రజలున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, నాయకులు బోగాది అప్పారావు, గండ్రెడ్డి రామునాయుడు, ఈగలపాటి యువశ్రీ, కమరున్నీసా బేగం, జీవన్ బాబు, గోపిశెట్టి గోపి, నావాన సింహాచలం, బాబూరావు, కోళ్ల అప్పలనాయుడు, సంద్రాన చినసన్యాసిరావు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

70వ వార్డులో రూ.56 లక్షల పనులకు..

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులోని పలు కాలనీల్లో రూ.56 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మంగళవారం భూమిపూజ చేశారు. శ్రామిక నగర్‌లో రూ.16.5 లక్షలు, ఎల్‌వీనగర్‌లో రూ.20లక్షలు, పల్లా చిన్నారావు వీధిలో రూ.20 లక్షలతో ఈ పనులను చేపట్టేందుకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శిలా ఫలాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు, వార్డు నాయకులు అచ్చిబాబు, బాబులునాయుడు, భూషణం, కె.ఎస్.నాయుడు, సత్యారావు, రాపేటి గోవింద్, దేముడుబాబు, కొణతాల జగన్నాథం పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు నివాళి


మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: నోబెల్ గ్రహీత మదర్ థెరిసా సేవలు మరువలేమని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జాగరపు శ్రీను అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా వర్ధంతిని కోరాడ కూడలి వద్ద మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిప్పల ఆనంద్‌రెడ్డి, జాగరపు జాజిబాబు, సూరి, దల్లి గురుమూర్తి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి మృతి


మృతుడు శంకరరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆగ్రో ఫారెస్ట్ విభాగానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు విధుల్లో ఉండగా కుప్పకూలి మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ ఆధీనంలో ప్లాంట్‌కు చెందిన పలు ప్రాంతాల్లో కొన్ని ఏజెన్సీల ఆధ్వర్యంలో కార్మికులు చెట్ల పెంపకం పనులు చేస్తుంటారు. ప్లాంట్ ఆధీనంలో అగనంపూడి జాతీయ రహదారి పక్కన ఉన్న భూమిలో మంగళవారం 25 మంది కార్మికులు పని చేస్తున్నారు. విధులు నిర్వహిస్తుండగా కర్రి శంకరరావు (57) వెన్ను నొప్పి వస్తోందని చెప్పి కూర్చున్నారు. వెంటనే వెనక్కి పడిపోయారు. ఆయన్ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సంస్థ సూపర్‌వైజర్ మాటూరి ఎల్లారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా వంటల పోటీలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని న్యూపోర్టు ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. జాతీయ పోషకాహార దినోత్సవంలో భాగంగా మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో మంగళవారం వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఐ ప్రారంభించారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ట్రైనింగ్ అండ్ మానిటరింగ్ ఆఫీసర్ సురేంద్ర కుమార్, సౌజన్య, సాధన, పద్మ, వెంకటలక్ష్మి, రాణి, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాధవికి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం


కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న మాధవి

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పని చేస్తున్న పలకా మాధవికి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం లభించింది. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో కట్టమంచి కాన్వొకేషన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. స్వయంగా క్యూఆర్ కోడ్ తయారు చేయడం, టీఎల్‌ఎం తయారు చేసి విద్యార్థులకు సులభంగా పాఠాలు బోధించడం తదితర కార్యక్రమాల ద్వారా ఆమె అధికారుల ప్రశంసలను అందుకున్నారు. పురస్కారం పొందిన సందర్భంగా మాధవిని సహ ఉపాధ్యాయులు అభినందించారు.